# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఫిబ్రవరి 2024

వెల : రూ. 10.00



**డిసెంబరు 8 నుండి 9 వరకు మండల**
**దీక్షా విరమణ సందర్భముగా నిర్వహించిన యాగ దృశ్యములు.**



యాగము

పూర్ణాహుతి





గురురామకోటి
పుస్తకములను
స్థూపములో
నిక్షిప్తం చేయుట

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 43 సంచిక 6
పేజీలు 44
ఫిబ్రవరి 2024

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ................................ ....... **పేజీ**

దాశరథీ శతకము .............................. ..........4
శ్రీబాబూజీ ఉవాచ......................................... 5
అమ్మమాట.................................... ............ 7
కర్మబంధాలు ................................................. 9
వైకుంఠ ఏకాదశి ......................................11
గురు శిష్య సంబంధం..................................14
సాములోరు ..................................................17
పరి ప్రశ్నేన సేవయా ....................................18
దివ్య దర్శనం ............................ ......................20
లక్ష్యం...... ....................... .................. .................. 21
కంచి పరమాచార్య ...... ...................................25
నారద భక్తి సూత్రములు ................ ..............27
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......29
మనశ్శతకము ..................................................30
నిరీక్షణ ..........................................................................31
అంతా రామ మయం............. ..... ... ....32
పూజ్య శ్రీ వాసుదేవానంద గిరి
స్వామివారి అభిభాషణ ...............................35
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ....... ............................. ....................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

43) **కలియుగ మర్త్యకోటినిను గంగొన రానివిధంబో భక్తవ**
**త్సలతవహింపవో చటుల సాంద్రవిపద్దశ వార్థి క్రుంకుచో**
**బిలిచిన బల్కవింతమఱపీ నరులిట్లనరాదు గాక నీ**
**దాశరథీ! కరుణాపయోనిధీ!**



భావం - పిలిచినా పలుకవేమి? నా దైవమా! కలియుగములో భక్తుల మొరలు వినగలేవా? మానవులను మరచితివా? నీ వాత్సల్యము తొలగిపోయినదా? మమ్ము కరుణింపలేవా? సముద్రమనెడు ఆపదలో మునుగుతూ ఎంత పిలిచినను పలుకవేమి? నా యందు ఇంత మరుపా? అనకూడదు కాని రావణుని చేత సీతాదేవి పొందిన చెర మరచితివా? కానగ రావా! ఓ రామా! శ్రీరామా!

*మనకు కనిపించే బాలరాముడు ఎవరు?
*కోట గోడకున్న చిన్న రంధ్రంనుండి దూరిన మహాత్ములు ఎవరు?
*గురు సంసారం ఎటువంటిది?
*అమృతత్వాన్ని పొందే అర్హత ఎవరికి ఉన్నది?
*గురుదేవులు చెప్పిన మాటమీద విశ్వాసం లోపిస్తే ఏమి జరుగుతుంది?
*ఎవరికి శ్రీబాబూజీ హోమగుండంలో కనిపించారు?
*మన శిరస్సు గురుపాదాల దగ్గర ఎందుకు ఉండాలి?
*ఉత్తరద్వారం ఎక్కడ ఉంది?
*ఒకరు పీకలేకపోయిన మొక్కను మరొకరు ఎలా పీకగలిగారు?
*పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసిన శిష్యుడు చివరికి ఏమి కోరుకున్నాడు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

26-11-1980

ఈరోజు రాత్రి శ్రీ బాబూజీని దాసు "కొంతమంది మహాత్ములు అష్టసిద్ధులు ప్రదర్శిస్తారుకదా! అందరూ ఎందుకు ప్రదర్శించరు?" అని ప్రశ్నించినపుడు శ్రీబాబూజీ సమాధానం చెపుతూ "అష్టసిద్ధులు మహాత్ముల ఆధీనంలోనే ఉంటాయి. అవి తరించటానికి ఉపయోగపడవు సరికదా అడ్డం పడతాయి.



ఒక దీపము ఉందనుకోండి. ఆ దీపము చుట్టూ ఒక గాజుచిమ్నీ వున్నదని అనుకుందాం. ఆ దీపపు కాంతి కనబడుతూనే ఉంటుంది. కాని ఆ దీపమును చేరగలమా? ఆ దీపానికి మనకు గాజుచిమ్నీ అడ్డువస్తుంది. అలాగే అష్టసిద్ధులు కూడా మోక్షస్థితిని పొందటానికి అవరోధంగా ఉంటాయి. వాటికి లొంగిపోకూడదు. సిద్ధులు పొందిన వ్యక్తికి బంధన ఏర్పడి దాని ద్వారా వ్యామోహము, సంకల్పములు జనిస్తాయి. అవి అతనిని పతనానికి తీసుకువెళ్తాయి. సిద్ధులను పొందినవారు కొంతమంది విద్యని ప్రదర్శిస్తారు. అది వారికి తాత్కాలిక ఆనందాన్ని కలుగజేయవచ్చు కాని శాశ్వత ఆనందాన్ని మాత్రం ఇవ్వదు. మహారాజు దగ్గరకు వెళ్ళినవాడు మణులు, రత్నాలు కోరుకోవాలి గాని గడ్డిని కోరుకుంటే ఏం లాభం?" అని ప్రశ్నించారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "శాశ్వతానందాన్ని ఇస్తాను కోరుకోరా అని భగవానుడు అంటుంటే ఈ సిద్ధులు కోరుకుంటే ఏం ప్రయోజనం? ఒక శిష్యుడు గురువుగారి ఆజ్ఞ మేరకు 12సం॥లు మహా తపస్సు చేస్తాడు. ఈ 12సం॥లు గురువుగారిచ్చిన లక్ష్యార్థమునందే మనస్సును లగ్నంచేసి తపస్సు చేస్తాడు. ఆ తర్వాత ఆ గురుదేవుడు తన శిష్యుడు ఏ స్థితిలో ఉన్నాడో తెలుసుకుందామని వస్తాడు. గురుదేవుని చూసి శిష్యుడు

నమస్కరిస్తాడు. గురుదేవుడు శిష్యుని ఆశీర్వదించి, 'శిష్యా! చాలా కఠోర తపస్సు చేశావు. నీకు తప్పక భగవానుడు ముక్తిని ప్రసాదిస్తాడు. నువ్వు శాశ్వత ఆనందాన్ని పొందే సమయం ఆసన్నమైంది. ఇప్పుడే జాగ్రత్తగా నిగ్రహంతో వ్యవహరించాలి' అని హెచ్చరిస్తాడు. ఆ శిష్యుడు 'స్వామీ! నాకు ముక్తికాదు కావలసింది. నీటిపైన తేలికగా నడిచేశక్తి కావాలి. దీనికోసమే నేను ఇంతకాలము తపస్సు చేస్తున్నాను స్వామీ!' అంటాడు.

ఆ గురుదేవుడు విచారిస్తాడు. 'వత్సా! ఏమిటీ ఈ అల్పమైనకోరిక? శాశ్వత ఆనందాన్నిచ్చే మోక్షాన్ని, నిరతిశయమైన పరమపదాన్ని వదలుకొని ఈ తుచ్ఛమైన కోరిక కోరుకున్నావేమిటయ్యా?' నీటిపైన పడవగాని లాంచిగాని తేలికగా తేలుతూ వెడుతుంది. దాన్ని పొందటానికా ఇంత తపస్సు చేసింది? ఈ కోర్కెలు అన్నీ క్షణికమైన ఆనందాన్ని మాత్రమే ఇస్తాయి. ఇవి ఇంకా భవబంధాలను అధికం చేస్తాయి. వీటివలన సుఖము శాంతి ఉండదు' అని చెప్తాడు. చూశారా! అష్టసిద్ధులు ఆకర్షించినంతగా ఏది ఆకర్షించగల్గుతుంది? దీనిని అధిగమిస్తేనే మోక్షాన్ని పొందగల్గుతారు'' అన్నారు. గురువుగారు నోరు మూసుకోరా అనగానే అదే ఆజ్ఞగా భావించి జీవితమంతా మౌనంగానే ఆనందం పొందుతూ గడిపారు సదాశివ బ్రహ్మేంద్రులు. గురుతత్వాన్ని అర్థం చేసుకోవడమంటే అలా ఉండాలి.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఫిబ్రవరి 2024 :*** AS 6554, 7236, 7996, 8362, 8632, 8968, 9204, 9205, 9207 - 9210; LM 4408, 4409, 4415

***మార్చి 2024 :*** AS 7456, 7685, 7687, 8003 - 8010, 8012, 9080, 9211, 9212, 9214; LM 4410, 4411, 4413, 4416, 4418, 4420, 4421, 4422

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

*యజ్ఞం-యజ్ఞకుండం*

"గురుదేవులు సత్య స్వరూపులు. మనని ఉద్ధరించడానికై ఒక అవతారం దాల్చి వచ్చినందుకు, నిష్క్రమించడమూ వుంటుంది. అదీ లీలే. ఇదీ లీలే. ఆ పరబ్రహ్మతత్వం ఎప్పుడూ ప్రకాశించేదే. అట్టి మహాత్ములయిన గురుమూర్తి యొక్క లీలలను వర్ణించుకుంటూ, వారి చరిత్రను వింటూ, వారు ఆచరించి చూపించిన మార్గంలో నడవడమే 'సాధన' అంటే, 'సు' అంటే ఆత్మవస్తువని చెప్పేవారు గురుమహరాజ్. కనుక 'సాధన' అంటే 'ఆత్మధనం'. ఇది ఎంత మనం సంపాదించుకుంటే అంతకంతకీ పెరుగుతుందే గాని, దానికి తరుగనేది లేదు- ఇన్‌కమ్ టాక్స్ వారి భయంగాని, చోరభయంగాని లేదు. ఈ 'ఆత్మధనం' మనని జనన, మరణ దుఃఖసాగరం నుండి రక్షిస్తుంది.



నామదేవుడు, జనాబాయి, మీరాబాయి, తుకారామ్ యిత్యాది భక్తులందరూ యీనాటికి ప్రకాశిస్తున్నారంటే, వారు సత్యవస్తువునే ఆశ్రయించి సత్య స్వరూపులయినారు కనుకనే. అందరిలోనూ వున్న సత్యవస్తువును దర్శించాలంటే దాని గురించి నిరంతర స్మరణ చేయాలి. ఈ ప్రాపంచిక విషయ సుఖాలన్నీ తాత్కాలికం మాత్రమే అని సదా ఎల్లప్పుడూ విచారణ చేయాలి. మూడు కాలాలలోను మారనటువంటిది ఒక్క సత్యవస్తువు మాత్రమే. ఈ సత్య వస్తువుని గురించి తెలుసుకోవాలంటే, యిటువంటి సత్సంగ సమావేశములు మన సాధనకి ఎంతో అవసరం.

గురుబోధా శ్రవణం ఒక మహాయజ్ఞం వంటిది. అట్టి గురుబోధ అఖండంగా ప్రజ్వరిల్లే 'సత్సంగ సమావేశమే' ఒక యజ్ఞకుండం. మనలోని కామక్రోధాది గుణములు, ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేని తనము యిత్యాది గుణాలను ఈ సత్సంగమనే యజ్ఞకుండంలో వ్రేల్చితే, మన జన్మ జన్మాంతర వాసనలు, పాపాలు భస్మీభూతమై, మనమూ

సత్యవస్తు రూపమైన 'విభూతి'గా మారిపోతాము. తద్వారా శాశ్వతమైన ఆనందము, శాంతి మన సొత్తవుతాయి.

'కలతల నుండి దూరం చేసేవాడైన కాళీ ప్రసాదబాబు యొక్క బోధామృతమును యీ ఎనిమిది రోజులు పరిపూర్ణంగా జుర్రుకొని, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములతోను, అఖండ సుఖశాంతులతోనూ సర్వులూ తులతూగెదరుగాక!

**_పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు_**

*** _ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును_***

**ఫిబ్రవరి 2024**

5 సోమ - శ్రీగరుదశమి - శ్రీ సద్గురుపాదపూజ

20 మంగళ - భీష్మ ఏకాదశి - భక్తసహిత శ్రీసద్గురుమూర్తి ప్రతిష్ఠ

20వ వార్షికోత్సవము, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

24 శని - మాఘ పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

**మార్చి 2024**

5 మంగళ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

8 శుక్ర: మహాశివరాత్రి - శ్రీ సద్గురు పాదపూజ

25 సోమ: ఫాల్గుణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

# గాఢమైన విశ్వాసమే భక్తి

- శ్రీ కాళీబాబు

# కర్మ బంధాలు

-భాగవతుల హనుమత్ జయప్రద

1978 లో జరిగిన యదార్ధ సంఘటన. అప్పట్లో మా తాతగారు కీ.శే. శ్రీ వారణాసి ఆదినారాయణ శాస్త్రి గారు తమ కుటుంబం (భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు)తో మన ఆశ్రమంలో వుండేవారు. మా పెద్దమావయ్య కీ.శే శ్రీ వారణాసి శివ రామ కృష్ణ ప్రసాద్ గారు డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. మా మావయ్య ఆశ్రమ స్థాపన జరిగిన తర్వాత చాలా సంవత్సరాలు ప్రతి రోజు ఆశ్రమంలో ఉన్న చెట్లకు మొదలు చేసి, అన్ని మొక్కలకి బకెట్లతో నీళ్లు తెచ్చిపోసి సేవ చేసుకునేవాడు.

ఆ రోజులలో ప్రతిరోజూ శ్రీబాబు, భక్తులతో కూడి వ్యాహ్యాళికి రావడం, అందరిని పేరు పేరునా పలకరించడం మన అందరికి తెల్సిన విషయమే కదా! అలా ఒకరోజు శ్రీబాబు భక్తులతో వ్యాహ్యాళికి వచ్చినప్పుడు మా పెద్దమావయ్యని పలకరించి, 'ఒరేయ్ ప్రసాదూ! నీకు ఉద్యోగం కావాలి అంటే నీ ముందు ఉన్న మొక్కని నేలనుండి పైకి పీకు' అని చెప్పి వెళ్లిపోయారు. ఆ రోజునుండి మా మావయ్య ప్రతిరోజు ఆ మొక్కని త్రవ్వి దాన్ని నేలనుండి తియ్యడానికి ప్రయత్నం చేశాడు. అలా ప్రతిరోజూ, 2 వారాలపాటు ప్రయత్నం చేసినా కూడా వ్రేళ్ళు బాగా బలంగా వుండటం వలన ఆ మొక్కని త్రవ్వి తియ్యలేకపోయాడు.

రోజూ శ్రీ బాబు రావడం 'ఏరా మొక్కని తీసావా?' అని అడగటం, మా మావయ్య 'అది ప్రతిరోజు ఎంత ప్రయత్నించినా రావడం లేదు బాబు' అని చెప్పడం జరుగుతోంది. అయినా ఇంకా డిగ్రీ కూడా పూర్తి అవ్వని వాడికి ఉద్యోగం ఎలా వస్తుంది? అనే సందేహం మనకి కలుగక మానదు. మహాత్ముల ప్రణాళికలు చాలా విచిత్రంగా మన ఊహకు అందకుండా ఉంటాయి.

ఒకరోజు సాయంత్రం శ్రీ బాబు భక్తులతో వచ్చి మళ్ళా అడిగినప్పుడు శ్రీ కోటిపల్లి మామ్మగారి కొడుకు కూడా అక్కడే ఉన్నారు. ఆయన చాలా రోజులుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. గత కొన్ని రోజులుగా జరిగేది ఆయన కూడా గమనిస్తూనే ఉన్నారు. ఒకరోజు ఆయన శ్రీ బాబు వెళ్ళిపోగానే అప్రయత్నంగా ఆ మొక్కని తియ్యడానికి చూడగా వెంటనే

ఆ మొక్క ఆయన చేతికి వచ్చి చిక్కిందట. ఆ మరునాడే ఆయనకి గవర్నమెంట్ ఉద్యోగంలో చేరమని పోస్టింగ్ ఆర్డర్ వచ్చింది. అది గురుదేవుల మహిమ. ఒక్కోసారి మనము గురుదేవులు వేరే వారికి చెప్పారు కదా, నాలో ఆ లోపము లేదు కదా అని అహంకరించవచ్చు కానీ మనలో కర్మ సబంధము కలిగించే వ్రేళ్ళు కిందకి బలంగా వున్నప్పుడు **(అధశ్చమూలాన్యనుసన్తతాని కర్మానుబన్ధీని మనుష్యలోకే)** ఈ సంసార వృక్షము యొక్క స్వరూపము అసలు గోచరించదు **(న రూప మస్యేహ తదోపలభ్యతే)** అది కేవలం వైరాగ్యం అనే బలమైన ఆయుధంతో మొదలంటూ నరకాలి **(అశ్వత్థమేనం సువిరూఢమూలం అసఙ్గశస్త్రేణ దృఢేన ఛిత్వా)** అప్పడు మాత్రమే అది మూలాల నుండి తీసివేయబడుతుంది. వైరాగ్యం అనేది సద్గురువుల కృపతో, సాధన ద్వారా మాత్రమే సాధించడం జరుగుతుంది. నిజానికి ఆ మొదలు కూడా ఆ భగవంతుని ఆశ్రయించియున్నదే!

అమ్మ (శ్రీ మాతాజీ ) బోధించినట్టు భగవంతుని గురించి వ్రాసి తెలుసుకోవాలి అంటే, ఆకాశం అంత పేపరు సరిపోదు, సముద్రం అంత ఇంకు సరిపోదు. అదే ఈ ఆధునిక పరిభాషలో చెప్పాలి అంటే ఎన్ని బైట్స్ మెమొరీ ఉన్న పరికరాలైన, అప్డేటెడ్ స్మార్ట్ ఫోన్ లైనా, గొప్ప గొప్ప టెక్నాలజీలైనా సరిపోవు.

ఒక ఉదాహరణకి ఫోను అనేది మన దేహం అయితే, దాంట్లో ఉన్న ఛార్జ్ అనేది భగవంతుని శక్తి. మనం ఎలా అయితే అందులో ఉన్న ఎదో ఒక అప్లికేషన్‌కి అలవాటు పడిపోతామో అదే మన మనస్సు. ప్రతి ఒక్కరం మన ఫోన్ లో ఉన్న ఎదో ఒక అప్లికేషన్‌ని పదే పదే తెరుస్తూ (నొక్కుతూ) చూస్తూ ఉంటాము (ఒక్కోసారి అందులో ఏమి లేకపోయినా కూడా!). అది కూడా చూసిన వాటికి సంబంధించిన విషయాలనే మళ్ళీ తిప్పి తిప్పి చూపిస్తూ ఉంటుంది. మిగితా అప్లికేషన్స్ కూడా మన ఫోన్లలో వుంటాయి. కానీ అన్నిటికన్నా మనకి ముఖ్యమయినది ఆ ఒక్క అప్లికేషన్ మాత్రమే (అదే మన మనస్సు).

**శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయానుపసేవతే ॥**

# వైకుంఠ ఏకాదశి

- పాలూరి కాళీప్రసాద్

శ్రీమహావిష్ణువు శయనైకాదశి(ఆషాఢ శుద్ధ ఏకాదశి) నాడు యోగనిద్రలోకి వెళతాడని మన పెద్దలు చెబుతారు. అప్పటినుండి నాలుగు నెలలు మహాత్ములు అందరూ చాతుర్మాస్య వ్రతం చేస్తారు. శయనైకాదశి అయిన రెండు నెలలకు విష్ణుమూర్తి నిద్రలోనే ఇటునుండి అటు తిరుగుతాడని, దానిని పరివర్తన ఏకాదశి (భాద్రపద శుద్ధ ఏకాదశి) అంటారు. మరో రెండు నెలల తరువాత ఆయన నిద్రనుండి లేచే ఉత్థాన ఏకాదశి (కార్తీక శుద్ధ ఏకాదశి) వస్తుంది. దీనినే క్షీరాబ్ధి ఏకాదశి అని, చిలుక (చిలుకు) ఏకాదశి అని కూడా పిలుస్తారు. సాగర మథనం (సముద్రాన్ని చిలకడం) ఆ రోజే ప్రారంభమైనదని చెబుతారు. ఆ తరువాత ధనుర్మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని (అది మార్గశిర మాసం కావచ్చు, లేదా పుష్య మాసం కావచ్చు) వైకుంఠ ఏకాదశి, లేదా ముక్కోటి ఏకాదశిగా జరుపుకుంటాం.

ఈరోజు శ్రీమహావిష్ణువు వైకుంఠపు ఉత్తరద్వారాలు తెరచి దర్శనమిస్తారని, ముక్కోటి దేవతలు ఆ అరుదైన దర్శనానికి వైకుంఠానికి చేరుకుంటారని ప్రతీతి. అయితే మనం దేవతల కాలమానాన్ని కొద్దిగా గమనిస్తే, చద్రమండలంలో ఒక రోజు అంటే మనకి ఒక నెలతో సమానం. అలాగే సూర్య మండలంలో ఒక రోజు మనకు ఒక సంవత్సరం. అలా పైకి వెళ్ళినకొద్దీ కాలప్రమాణం పెరుగుతూ పోతుంది. బ్రహ్మదేవుడికి ఒక క్షణం అయితే మనకు ఒక సంవత్సరం అవుతుంది. మరి అంతకంటే పై స్థాయిలో ఉండే విష్ణుమూర్తికి మన ఒక సంవత్సరంలోనే నిద్ర, మెలకువలతో కూడిన రోజు పూర్తి అయిపోవడమంటే కొంచెం ఆశ్చర్యంగానే తోస్తుంది.

కొంచెం లోతుగా ఆలోచిస్తే నిజానికి ఇవన్నీ మన సాధనలోని దశలని అనిపిస్తాయి. వ్యాపకత్వం విష్ణువు లక్షణం. ఆయన విశ్వమంతటా వ్యాపించి ఉంటాడు. అలాగే మన శరీరంలో అంతటా వ్యాపించి ఉండేది మనస్సు. ఉత్ అంటే ఎత్తు, లేదా పైన. మనం మ్యాపులో చూస్తే పైన ఉండే దిశను ఉత్తరం అంటాం కదా. ఉత్తరం అంటే నువ్వు చూస్తున్న వాటిలో మిగిలిన వాటికంటే పైన ఉండేది. ఉత్తర ద్వారం

అంటే సహస్రార చక్రమే. అసలు అన్నిటికంటే పైన ఉండేది ఉత్తమం. సనకాది మహర్షులు జ్ఞానతృష్ణతో ఉత్తరదిశగా ప్రయాణిస్తుంటే అక్కడ దక్షిణాభిముఖుడై పరమేశ్వరుడు గురురూపంలో దక్షిణామూర్తిగా వారి ఎదుట ప్రత్యక్షమై తన మౌన వ్యాఖ్యతోనే పరబ్రహ్మ తత్వాన్ని ప్రకటితం చేస్తారు. అలా గురుమూర్తి ఉత్తర భాగంలో, అంటే తనకంటే పై స్థాయిలో ఉండి చేసిన బోధను అందుకొని సాధకుడు తన యోగసాధనను ప్రారంభిస్తాడు. అదే శయనైకాదశి. పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేన్ద్రియాలను నిగ్రహించి వాటికి అధిపతియైన పదకొండవది అయిన మనస్సుతో చేసేది సాధన. అందుకే ఇవన్నీ ఏకాదశులు.

ఇలా సాధన మొదలు పెట్టిన సాధకుడి మనస్సు మెల్లగా పరివర్తన చెంది ప్రపంచాభిముఖంగా ఉండేది పరమాత్మకు అభిముఖంగా తిరుగుతుంది. అదే పరివర్తన ఏకాదశి. సాధన మరికొంత ముందుకు సాగుతున్న కొద్దీ ఆ వ్యక్తి తాను ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎగబ్రాకుతాడు. చివరికి బ్రహ్మజ్ఞానోదయం అవుతుంది. అలా బ్రహ్మజ్ఞానమునందు మేల్కొనడమే ఉత్థాన ఏకాదశి. అలాగే సాధనలో మన మనస్సును చిలికి అందులోని మంచి, చెడు విషయాలనన్నింటిని బయటకు తీసివేసినప్పుడు చివరికి బ్రహ్మామృతం లభిస్తుంది. అందుకే ఇది చిలుకు ఏకాదశి కూడా. ఇప్పుడు తాను బ్రహ్మమునని, ఈ జగత్తుకంటే ఉన్నతమైన స్థితిలో (దానికి ఉత్తర భాగంలో) ఉన్నానని అనుభూతిలోకి తెచ్చుకుంటాడు. అలా **'అహం బ్రహ్మాస్మి'** అని అనుభవంలోకి తెచ్చుకున్న తరువాత మరి జగత్తు ఏమవుతుంది? తాను మాత్రమే బ్రహ్మ కాదు కదా! బ్రహ్మమంటేనే సర్వవ్యాపకమైనది. అంటే **'సర్వం ఖల్విదం బ్రహ్మ'** అని గ్రహిస్తాడు.

విష్ణు సహస్రనామాలలో మొట్టమొదటిది **'విశ్వం'**, రెండవది **'విష్ణుః'**. అంటే ఈ విశ్వమంతా విష్ణువే. ఈ అనుభవాన్ని పొందడమే ఉత్తరద్వార దర్శనం. దీనిని ఉత్తరద్వారం అన్నారు కానీ ఉత్తమద్వారం అనలేదు. ఎందుకంటే అది పైన ఉంది కానీ, అన్నిటికంటే పైన కాదన్నమాట. ఎందుకంటే ద్వారం అంటేనే దానిలోనుంచి ఇటూ అటూ వెళ్ళే వీలు వుంటుంది కదా. అంటే ఆ ద్వారానికి ఇంకా పైన (ఇంకా ఉత్తరంలో) ఏదో ఉంది అన్నమాట. సరిగ్గా అక్కడే ఈ ముక్కోటి దేవతలు

విష్ణుదర్శనం కోసం నిరీక్షిస్తూ ఉంటే స్వామి సాక్షాత్కరిస్తారు. ఇప్పుడు చూస్తే దేవతలందరూ ఉత్తరభాగంలో దక్షిణం వైపు తిరిగి ఉన్నారు, విష్ణుమూర్తి దక్షిణభాగంలో ఉత్తరంవైపు తిరిగి ఉన్నారు. మొదట మనం చెప్పుకున్న దక్షిణామూర్తి ఉత్తరభాగంలో దక్షిణం వైపు తిరిగి ఉంటే ఋషులు దక్షిణభాగంలో ఉత్తరంవైపు తిరిగి ఉన్నారు.

మళ్ళీ మన సాధన విషయానికి వస్తే, ప్రపంచానికంటే క్రింది స్థితిలో ఉండి, దానిచే నిత్యం బాధింపబడుచున్న సాధకుడు ఉన్నత స్థితిలో ఉన్న గురుదేవుల ఉపదేశంతో సాధన ప్రారంభించి, పరివర్తన చెంది, తనను ఈ ప్రపంచం బంధించలేదని, తాను దానికంటే ఉన్నతుడైన బ్రహ్మవస్తువునని తెలుసుకుని, ఇప్పుడు క్రిందికి (దక్షిణానికి) తిరిగి చూస్తే తనకు విశ్వం ఉండవలసిన స్థానంలో విష్ణుమూర్తి కనిపిస్తాడు. ఇదే ఉత్తరద్వార దర్శనం. ఇట్టి అత్యుత్తమ స్థితిలో స్థిరంగా కూర్చున్న వ్యక్తి (ఉత్ + ఆసీనః = ఉదాసీన) సర్వాన్ని సమదృష్టితో చూస్తాడు. నేలమీద నడిచేవానికి ఒకరు లావుగా, ఒకరు సన్నగా, ఒకరు ఎత్తుగా, ఒకరు పొట్టిగా ఇలాంటి భేదాలన్నీ కనిపిస్తాయి కానీ ఎత్తైన పర్వతశిఖరం మీదనుంచో, విమానంలోనుంచో చూసేవాడికి ఏ భేదాలైనా కనిపిస్తాయా? అంతా ఏక స్వరూపంగానే కనిపిస్తుంది. అదే **'సర్వం ఖల్విదం బ్రహ్మ'**.

ఈ ఏకాదశులన్నీ ఒకదానికొకటి రెండేసి నెలల దూరంలో వుండటం మనం గమనించవచ్చు. అలాగే సాధనలో కూడా మనస్సు నిలబడాలంటే రోజూ కనీసం రెండు గంటలైనా ధ్యానం చెయ్యాలని గురువులు చెబుతారు.

అలా సాధన చేసిన సాధకుడికి చివరికి **'నీవె నేనై నేనె నీవై జగంబెల్ల ఏక స్వరూపమై నేనుగా భాసించే బ్రహ్మానందానుభూతిని'** గురుదేవులు అనుగ్రహిస్తారు. అప్పుడు నిత్యం వైకుంఠ ఏకాదశే! తాను చూసేదంతా ఉత్తరద్వార దర్శనమే!

# గురు శిష్య సంబంధం

సేకరణ- బొంబాయి కృష్ణారావు

ఈశ్వరుడు, పరోక్షంగా, అదృశ్యంగా ఉన్నప్పటికీ, ప్రత్యక్షంగా ఒకరి వాక్యమందు తాత్పర్యబుద్ధితో మనము అనుసరిస్తున్నప్పుడు, వారి ద్వారా బోధిస్తాడు. మనం ఏ దృష్టితో ఉండాలి? ఎలాగ ఒక గురువును ఆశ్రయించాలి? అంటే, నా బుద్ధికి అతీతమైనటువంటి ఈశ్వరుడి యొక్క స్వరూప స్వభావ స్థితి, గతినాకు అర్థం కాదు. "ఓ ఈశ్వరా!... నీవు నన్ను అనుగ్రహించి, మార్గదర్శకుడివి కా. నేను ఎవరినో నమ్ముకుంటాను, ఏ వ్యక్తినో అనుసరిస్తాను. ఆ వ్యక్తిలో వుండే బుద్ధి కుశలత, పాండిత్యం, ఇలాంటివి కాక - అతడి ముఖతః నీవు నన్ను అనుగ్రహించి, మార్గదర్శకుడివి కా," అని అడగాలి.

ప్రార్థించేది, అర్థించేది భగవంతుణ్ణి, అనుసరిస్తున్నది కనపడుతున్న మనుష్యుడిని. ఈ దృష్టిలో ఒక గొప్ప లాభం ఏమిటి? అంటే, మీరు అనుసరిస్తున్న వ్యక్తికి ఏమి దోషం ఉండదు. ఆ మనిషి యొక్క బుద్ధిచేత స్వకపోల కల్పితమైనట్టి యుక్తియుక్తములు అయినటువంటి మార్గదర్శకత్వం కాక, ఈశ్వరుడు మీకు ఏమి చెప్పదలుచుకున్నాడో, ఏ మార్గంలో నడిపించదలచుకున్నాడో, అది మీ ప్రార్థన బలంచేత, చిత్తశుద్ధి చేత, అతడి ముఖతః మీకు వస్తుంది. అందుకని, **శివయేవ గురు:** ఈశ్వరుడే గురువు.

ఈ దేహము ఒక నౌకతో సమానం. సంసార సముద్రంలో నౌక పయనిస్తుంది. దీన్ని సరియైన దారిలో పెట్టి గట్టుకి చేర్పించే వాడే సద్గురువు. కనుక సద్గురువును ఆశ్రయించడం ప్రథమ కర్తవ్యం, బ్రహ్మజ్ఞానం వాదోపవాదాలతో లభించదు. యోగ సాధన కావాలి. తపోనిష్ట కావాలి. అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహం వుండాలి. వేదవేదాంగ పరిజ్ఞానం వుండాలి. వీటి అన్నింటికి మార్గదర్శకుడు సద్గురువు మాత్రమే.

మానవరూపంలో అవతరించిన నారాయణుడు కూడా సద్గురువును ఆశ్రయించాడు. శ్రీరాముడు వశిష్ఠ విశ్వామిత్రులను గురువులుగా సేవించాడు. శ్రీకృష్ణుడు, సుదాముడు మొదలగు మిత్రులతో కలసి సాందీప మహర్షి వద్ద గురుసేవలు చేసి వేద విద్యలు అభ్యసించాడు. గురుకులవాసం చేసాడు. సహాధ్యాయులతో కలసి తాను

అడవికి వెళ్ళి గురువుకు కావలసిన సమిధలు, పండ్లు మొదలగునవి సేకరించి తెచ్చాడు. ఆ సమయంలో కష్టాలు అనుభవించాడు. గురువుల అనుగ్రహాన్ని పొందారు. శ్రీకృష్ణుడ్ని జగద్గురువుగా పరబ్రహ్మముగా గుర్తించిన తరువాత సహాధ్యాయులు, గురువులు తమతమ భాగ్యానికి ఆనందించారు. లీలానాటక సూత్రధారి అని పొగిడారు. గురుశుశ్రూషకు సంతోషించినట్లుగా నేను ఇంక ఏ ధర్మాచరణకు సంతోషించనని అలనాడు భగవానుడే ప్రకటించాడు. గురుమహిమ వర్ణనాతీతం. గురుప్రసాదం సకలార్ధ సాధకం.

మంచి మాటలతో గురువు చేత శాసించబడేవాడు శిష్యుడు. భోగమోక్ష విషయంగా మంచి రెండు రకాలు. (గురువులో లేశ మాత్రమైన ఏమైనా లోపాలు వుంటే, దోషాలు, బలహీనతలు ఉంటే వాటిని పదిమందికి టముకు వేసి ప్రచారము చెయ్యకుండా కప్పివుంచేవాడు ఛాత్రుడు. నీడలాగ గురువెంటవుండి విద్యనభ్యసిస్తూ సేవిస్తూ జీవించేవాడు అంతేవాసి. ఇలాగ శిష్యులలో బేధాలు వున్నాయి) శిష్యునికి ఏది హితమని భావిస్తాడో దాన్నే గురువు బోధిస్తాడు. మారుమాట్లాడకుండా శిష్యుడు శిరసావహించాలి. ఇహలోకంలో సుఖాన్ని, పరలోకంలో ముక్తిని ప్రసాదించేది, హితమంటే. ఒక్కొక్కప్పుడు గురువు చెప్పింది ఇహలోకంలో కష్టంగావచ్చు. అయినా శిష్యుడు 'కాదు' అనకూడదు. వేదశాస్త్ర పురాణాలు ఏది ఎవరికి హితమో నిర్ణయించాయి. ఆ పరిజ్ఞానంతోనే గురువు శాసిస్తాడు. ఆచరణకి అనుగుణం అయిన సాధన సంపత్తిని నేర్పిస్తాడు. నిత్యానిత్యవస్తు వివేకం కలిగిస్తాడు. భోగాలు క్షణికమని గ్రహించి వైరాగ్యంతో గురుపాదాలను ఆశ్రయించడమే శిష్యుని కర్తవ్యం.

గురువు - శిష్యులు మధ్య సమన్వయం ఎలా ఉండాలి?

గురువుకు దగ్గరగా ఉండటం అంటే, కొలుచుకొని 1 మీటరు దూరంలో కూర్చోవాలి అని గాని, లేదా ఇంకా దగ్గరగా ఒక అడుగు దూరంలో కూర్చోవాలని గాని అర్థం కాదు. గురువు యొక్క మనస్సులోని భావాలకు దగ్గరగా ఉండాలి. ఆ భావాలకు అనుగుణంగా ప్రవర్తించాలి, జీవించాలి అని అర్థం. ఇదే సమీపం అంటే. ఒకవేళ నాకు అవకాశం లేక పోతే, నా వాళ్ళు మాత్రమే కూర్చోవాలనుకోవడం సత్ శిష్యుడి లక్షణం కాదు. ఇక క్రింద కూర్చోవాలంటే, ఒకవేళ ఆరోగ్యరీత్యా కూర్చోలేక

పోయినా, ఎంతబాధనైనా అనుభవిస్తూ ఖచ్చితంగా నేలమీదనే కూర్చోవాలి, క్రిందనే కూర్చోవాలి - అని అర్థం కాదు. మరి? నీ శరీరం కాదు క్రిందుగా వుండాల్సింది, నీ భావాలు! ఏమిటవి? గురువు తెలిసినవాడు, నేను తెలుసుకోవలసినవాణ్ణి. గురువుపట్ల గౌరవం, వినయం, విధేయత, నమ్రత ఉండాలి - అని. గంగ పై నుండి క్రిందికి ప్రవహించినట్లు జ్ఞానగంగ వున్నతుడైన గురువు యొక్క ముఖం నుండి నా మస్తకంలోకి ప్రవేశించాలని. అందుకోసం మన తల గురువు యొక్క పాదాల వద్ద ఉండాలని భావించాలి. ఎంత గొప్పజ్ఞానాన్ని సంపాదించినా గురువుతో సమానుడను అని భావించరాదు. అహంకారికి ఆధ్యాత్మిక రంగంలో పతనం తప్పదు.

అలా తత్వజ్ఞానం ఉపదేశం పొందడానికి అర్హుడు వాడే. అనంత కాలంలో తానూ గురు పదవిని అధిష్టిస్తాడు. ఉత్తమ శిష్యులను రూపొందించి గురుఋణ విముక్తుడవుతాడు. దీనికి ప్రత్యక్ష ప్రమాణం మన మధ్య నడయాడే మాతాజీవారు. గురుతత్వాన్ని కాచివడపోసిన సాధుమహాత్ములంతా ఏకకంఠంతో శ్లాఘించారు మన మాతాజీని. ఆమె సత్ శిష్యుడికి, సద్గురువుకు సరయిన నిర్వచనం.

## గ్రుడ్డి అనుకరణ పనికిరాదు

ఆదిశంకరులకు ఒక తెలివితక్కువ శిష్యుడుండేవాడు. అతడు గురువుగారిని అన్ని విషయాలలో అనుకరిస్తూ ఉండేవాడు. శంకరాచార్యులు 'శివోఽహం' అంటే శిష్యుడు కూడా 'శివోఽహం' అనేవాడు. శిష్యుడి లోపాన్ని సరిదిద్దాలని శంకరులు అనుకున్నారు.

వారు వెళ్ళే త్రోవలో ఒక కంసాలి అంగడి ఉంది. శంకరులు అక్కడ పాత్రలో అప్పుడే కరుగబెట్టి ఎర్రగా మండుతూ ఉన్న ఇనుము చూశారు. దానిని తీసుకుని శంకరులు గడగడా త్రాగేశారు. శిష్యుణ్ణి కూడా త్రాగమన్నారు. గురువుగారు చేసిన ఈ పనికి మాత్రం శిష్యుడు అంగీకరించ లేకపోయాడు. అప్పటి నుండి 'శివోఽహం' అనటం కూడా మానివేశాడు.

- శ్రీరామకృష్ణులు

# సాములోరు

- పెనుమాక నాగేశ్వరరావు

**సాములోరు కాదు, మీరు సాక్షాత్తూ రాములోరు //**
**సాములోరు కాదు మీరు, సాక్షాత్తూ రాములోరు //**
**బాబాగారు కాదు మీరు, మా బాగు కోరే మా బాబుగారు//**
**ఉపాసకులన్న ఉద్దండులున్నారు, సిద్ధాంతి అన్న పండితులున్నారు//**
**సన్యాసి కాదు, సంసారి కాదు ఆయనో సంస్కారి అన్న సహృదయులున్నారు//**
**ఎవరెట్లా భావించినా, సాములోరు కాదు మీరు సాక్షాత్తూ రాములోరు/ /**

**బ్రహ్మమొక్కటే అని చెప్పే బ్రహ్మ జ్ఞాని మీరు //**
**గురుతు తెలిపే వాడే గురువు అన్న గురుబ్రహ్మ మీరు //**
**ఆకలెరిగి అన్నంపెట్టి, కడుపు నింపే అమ్మ మీరు //**
**ఇహపరాలనొసగే పరబ్రహ్మ స్వరూపులు మీరు //**
**ఎవరెట్లా సేవించినా, సాములోరు కాదు మీరు సాక్షాత్తూ రాములోరు//**

**హితబోధ చేసే మందస్మిత వదనులు మీరు //**
**పురుషులందు పుణ్యపురుషులు మీరు //**
**పురాణ పురుషులు మీరు, గురుపరమేశ్వరులు మీరు //**
**అద్వైత సామ్రాజ్య చక్రవర్తులు మీరు //**
**ఎవరెట్లా పూజించినా, సాములోరు కాదు మీరు సాక్షాత్తూ రాములోరు//**

**బిళ్ళగోచి పెట్టి బళ్ళారి వెళ్ళినా//**
**అడ్డకట్టు కట్టి అరుగుమీద కూకున్నా//**
**చలికోటు వేసుకొని పడమటి దేశంలో పవళించినా//**
**మెడనిండా పూదండలేసుకుని ప్రవచించినా //**
**ఎవరెట్లా దర్శించినా, సాములోరు కాదు మీరు, సాక్షాత్తూ రాములోరు //**

# పరి ప్రశ్నేన సేవయా

-కీ.శే. పరాశర ప్రసాద్

'భగవానుడు సర్వవ్యాపకుడు. ఆయనను సర్వత్రా దర్శించవచ్చు కదా! ఆయనను దర్శించటానికి వేరొకరి సహాయం అవసరమా?' అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీసద్గురుదేవులు మాట్లాడుతూ....

"వేరొకరు అని మీరు ప్రస్తావించినది సద్గురుమూర్తి అవసరం ఏముంది? అనే కదా! గాలి సర్వవ్యాపకమైనదే కదా! మన చుట్టూ వ్యాప్తమై ఉన్నది. కాని గాలి కోసం ఫ్యాన్‌లు ఎందుకు వాడుతున్నామో చెప్పగలరా? ఫ్యాన్ గాలిని ఉత్పత్తి చేస్తోందా? లేక ఆ ప్రదేశంలో వున్న గాలిని మనకు అందుబాటులోకి తెస్తోందా? ఆ విషయం అలా ఉంచండి. వ్యాధిగ్రస్థులైన వారికి ప్రత్యేకంగా వేరొక పరికరం ద్వారా ఆక్సిజన్ అందించవలసిన అవసరం ఏముంది? మన చుట్టూ ఆవరించి ఉన్న గాలి ఉంది కదా!

అంత ఎందుకండీ! మీరు చదువుకున్నవారు. మీకు ఎవరి సహాయం లేకుండానే గ్రంథాలను స్వయంగా అధ్యయనం చేసి విద్యావంతులు అయ్యారా? ప్రాపంచిక విద్యను అభ్యసించటానికే గురువు కావాలి కదా! మరి సర్వ సృష్టికి కారకుడు, సమస్త జగత్తుకు ఆధారమూర్తి అయిన ఆ భగవంతుని గుర్తించే మార్గాన్ని శోధించి తమ జీవితాలను త్యాగంచేసి ఫలితాన్ని సాధించినవారి సహాయ సహకారాలు లేకుండా భగవంతుని గుర్తించ గలిగినవారు ఎవరైనా ఉన్నారా?

సర్వవ్యాపకుడైన భగవానుని గుర్తించటానికి ఒక గైడ్ కావాలి. ఆ గైడ్ ఎవరు? ఆయనే సద్గురు మూర్తి. సాక్షాత్తు ఈశ్వరుడే మానవ ఆకారంలో రూపధారణ చేసి, మానవులని ఉద్ధరించటానికి అవతరించి వచ్చారు. మానవులు మానవాకారంలో వస్తేనే గుర్తించగలుగుతారు. అంతేకాదు వారు సూచించే మార్గదర్శక సూత్రాలు అందుకో గలుగుతారు.

మేఘావృతమైన ఆకాశంలో సూర్యభగవానుడు గోచరించనట్లు గుణ సహితుడైన మానవుడు మాయకి లోబడి తన చెంతనే ఉన్న భగవానుని గుర్తించలేక పోతున్నాడు. మాయని రహితం చేయగల శక్తి సద్గురుమూర్తికే సాధ్యంగాని, మానవులు సాధించగల్గుతారా? సద్గురు సమాశ్రయం లభించని సాధకులకి భగవద్దర్శనం దుస్సాధ్యం సుమా!" అన్నారు శ్రీబాబు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**ఫిబ్రవరి 2024**

5 సోమ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

8 గురు: మాసశివరాత్రి

9 శుక్ర: అమావాస్య

14 బుధ: మాఘ శుద్ధ పంచమి - వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ

16 శుక్ర: రథసప్తమి

20 మంగళ: మాఘ శుద్ధ ఏకాదశి - భీష్మ ఏకాదశి. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

24 శని : మాఘ పూర్ణిమ - గురు పూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

**మార్చి 2024**

5 మంగళ: శ్రీ గురుదశమి - సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

8 శుక్ర: మహాశివరాత్రి - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

25 సోమ: ఫాల్గుణ పూర్ణిమ - సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

లక్షలాది కిమ్మత్తుగల బంగారానికి ధర నిర్ణయించేటందుకు, దాని వన్నెచిన్నెలు తేల్చేటందుకు రెండు అణాల రాతిముక్క, గీటురాయి ఉపకరిస్తోంది కదా! అలాగే అఖండవ్యాపక సచ్చిదానంద పరమాత్మను తెలుసుకునేందుకు భౌతికమూ, జడమూ అయినా శుద్ధబుద్ధి ఉపకరిస్తుంది.

ఇంద్రియాలు విషయాలను పట్టుకుంటాయిగాని, తమకు అధిష్ఠానమైన ఆత్మను గ్రహించలేవు. పోలీసు దొంగను పట్టుకుంటాడు కాని, మెజస్ట్రేట్‌ను పట్టుకోలేడు కదా!

- వెంకట రమణ ప్రసాద్

# దివ్యదర్శనం

-వి. సీతామహాలక్ష్మి

శ్రీబాబూజీతో అనుభవాలను గురించి చెప్పాలంటే మా జీవితంలో ప్రతిసంఘటనా మాకు అనుభవమే. మా పెద్దబ్బాయికి ఒడుగు చేయాలి అని అనుకున్నాం. మేము జమ్మలమడుగు తాలూకా, వద్దిరాల గ్రామంలో ఉండేవారం. అక్కడ దగ్గరలోనే ముద్దనూరు గ్రామంలో శ్రీశంకర జయంతి నాడు సామూహిక ఉపనయనములు చేస్తున్నట్లు తెలిసి, అక్కడ మా అబ్బాయికి ఉపనయనం చేయించటానికి పేరు నమోదు చేయించుకున్నాము.

అక్కడ కొత్తగా బ్రాహ్మణ సంఘం ప్రారంభించటం వలన యజుర్వేదం వారు యిద్దరికి, ఋగ్వేదంవారు యిద్దరికి ఉపనయనం చేయించటానికి నిశ్చయించారు. ఎక్కువ వ్యవధి లేదు. పిల్లవానికి వుంగరం చేయించాలని, ఇంట్లో ఉన్న బంగారం యిస్తే సాయంకాలనికి ఉంగరం చేసి యిచ్చారు. ఆ సంఘంలో 116 రూ॥లు యిస్తే, నలుగురికి భోజనం, ఎక్కువ మంది వస్తే ఒక భోజనానికి ఐదు రూపాయలు తీసుకుంటామన్నారు. ముందురోజు సాయంత్రం అందరికీ భోజనాలు పెట్టారు. తెల్లవారుజామున బాజాభజంత్రీలతో చాలా వేడుకగా జరుగుతుంటే యింట్లో కూడా అంతవైభవంగా జరగదు అనిపించింది.

విఘ్నేశ్వరపూజ అయ్యాక పురోహితుడు దంపతులను ఉద్దేశించి 'మీ యిలవేల్పు ఎవరో చెప్పండి' అన్నాడు. మేము ఉభయులము ఒకరినొకరు చూసుకుని, 'మా సద్గురుదేవులు' అని చెప్పాము. వెంటనే ఆ హోమంలో శ్రీసద్గురుదేవులు అభయ హస్తంతో మాకు కనిపించారు. ఈ ఉపనయనం అయినంతసేపూ శ్రీబాబు అలాగే వున్నారు. మాకు ఎనలేని సంతోషము. ఎవరిని చూసినా, ఏ దేవుడిని చూసినా అంత సంతోషము, ఆనందము కల్గుతుంది? ఈ అనుభవం శ్రీబాబుకి చెప్పాలని అనుకుని నంబూరు వచ్చాం. శ్రీబాబు మమ్మల్ని చూసి 'నా ఆశీర్వచనం అందిందా?' అని అడిగేసరికి ఆశ్చర్యపోయాం! మేము చెప్పవలసినది ఆయనే చెప్పేసరికి, మా నోటమాట రాలేదు.


లక్ష్యం
ముకుంద్
గురువుగారు! ఈ రోజు నేను లక్ష్యార్థం తీసుకోవచ్చా?
అలాగే నాయనా!
1
మంత్రం వినడానికి కుడిచెవి పట్టు నాయనా!
2


కుడిచెవి మాత్రమే ఎందుకు గురువుగారు? దేవుడు మనకు ప్రతి ఇంద్రియాన్ని రెండు ప్రక్కలా రెండు ఇచ్చినప్పుడు ఎడమ ప్రక్క వాటిని అపవిత్రముగా ఎందుకు భావిస్తారు?
3


దేని ఉపయోగం దానిదే నాయనా! ఎంత అభ్యసించినా సరే నువ్వు కుడి చేతితో చేసే పనులు ఎడమ చేత్తో చెయ్యవు కదా!
4


సరే. ఇప్పుడు నేను
మంత్రం చెబుతాను,
విను. ఓం శ్రీం రామ్.
5


ఓస్ ఇంతేనా! ప్రతి
రోజు ప్రార్థనలో వినే
ఈ మంత్రం
లక్ష్యార్థమా! ఇది
చదివినా,
చదవకపోయినా
ఒకటే!
6


అయ్యో! నేను బ్రతికున్నంత కాలం లక్ష్యార్థమంత్రాన్ని సరిగ్గా జపించలేదే! ఇక నాకు నరకమే!
7


చూశారా గురువుమీద లక్ష్యం లేకపోతే వచ్చే ఫలితమేమిటో! ప్రతి రోజూ వినే నామమైనా, పెద్ద నామమైనా ఒక సారి గురువు జపించమని ఆదేశించినప్పుడు దాన్ని జీవితాంతం పాటించాల్సిందే. అదే లక్ష్యార్థం.
8

# కంచిపరమాచార్య

సేకరణ - మురళీ

(గత సంచిక తరువాయి)

"ఏదైనా భక్తి గీతం పెట్టనా?" "మాకు ఏ పాటలూ వద్దు, మమ్మల్ని ప్రశాంతంగా వదిలెయ్యి" పూనమల్లి వైపుకు కారు తిరగగానే, "నిదానంగా వెళ్దాం పాల్ రాజ్. మాకు అంత అవసరం ఏమి లేదు" అన్నది భాగీరథి. "ఈరోజే పరమాచార్య స్వామివారిని దర్శించుకోరా? ఇంకో రెండు గంటల్లో అక్కడికి చేరుకుంటాము".

"రేపు తీరిగ్గా దర్శనం చేసుకుంటాము. అదేమీ నాకు ముఖ్యం కాదు. ఈమె కోసమే, కేవలం దీనికోసమే తను అమెరికా నుండి వచ్చింది" అని జవాబిచ్చాడు శివశంకరన్.

"ఓహ్! అవునా? నాకు చాలా ఆనందంగా ఉంది. పెరియవా దైవ స్వరూపులు సార్. నేను ఇప్పటిదాకా ఎనభైఎనిమిది సార్లు దర్శించుకున్నాను. వందకు మరో పన్నెండు తక్కువ. వారి వయసుకు సమానం అవుతుంది".

"పాల్ రాజ్! నువ్వు క్రైస్తవుడివి కదా?" "అవును సార్! అయితే ఏమిటి?" "విడ్డూరం" అన్నాడు శివశంకరన్. "మా ఇంట్లో ఆయన దేవుడు, మీకు తెలుసా? స్వామివారి ఒక్కచూపు చాలు, కోరుకున్నవి దక్కుతాయి"

"నీకు జరిగిందా?" "ఎందుకు లేదు? నా కుమార్తె రోజ్ మేరీకి తపాలా శాఖలో ఉద్యోగం దొరకాలి అనుకున్నాను. మరలా దర్శనానికి వెళ్ళేటప్పటికి తనకు నియామక పత్రం వచ్చింది".

"అవునా? ఆయన టెలిఫోన్లో కూడా ఉన్నాడా?" శివశంకరన్ మాటల్లోని వ్యంగ్యం పాల్ రాజ్ గమనించలేదు. "పెరియవా దేవుడు. దూరం నుండే వారిని దర్శించి వేడుకోండి, మీ కోరిక నెరవేరుతుంది. ఇంతకూ మీకు ఏమి కావాలి సార్?" "కాంచీపురంలో మంచి హోటల్" "మేడమ్, మీకు?" "మనఃశాంతి".

"సార్ చాలా చతురులు" "చూడు, పాల్ రాజ్, నాకు ఇటువంటి వాటిపై నమ్మకం లేదు. నా పరిశోధన ప్రకారం నాకు భగవంతుని అవసరం లేదు". "నాకు కావాలి, సార్" "ముందర చూడు" అని గట్టిగా అరిచాడు శివశంకరన్. పెద్ద లారీని ఢీకొట్టబోతూ వెంట్రుకవాసిలో తప్పి,

కారు తారురోడ్డు నుండి క్రిందకు దిగి ఒక చెట్టు వద్ద ఆగింది. శివశంకరన్‌కు భయంతో చెమటలు పట్టాయి. పాల్ రాజ్ క్రిందకు దిగి టైరు పంక్చర్ అయినట్టు గమనించాడు. "పదిహేను నిముషాల్లో టైరు మారుస్తాను" అని చెప్పి పనిలోకి దిగాడు.

శివశంకర్ సిగరెట్టు వెలిగించాడు. ఆ చెట్టు కిందనే ఒకతను కొబ్బరిబోండాలను అమ్ముతున్నాడు."ఒకటి కొట్టివ్వనా సార్?" "వద్దు, నాకు తాగాలని లేదు" "మీకోసమని ఒకటి కొట్టాను సార్" మరలా అగ్గిమీద గుగ్గిలం అవుతాడని అనుకుంది భాగీరథి, కానీ ఏ కళనున్నాడో సరే అని తీసుకున్నాడు. తీయని కొబ్బరినీళ్లు తాగి, "ఇదొక్కటే ఈ దేశంలో ఇంకా బావుండేది" అన్నాడు. "పాల్ రాజ్, నువ్వు కూడా ఒక కొబ్బరిబోండాం తీసుకో"

"లేదు మేడమ్, స్వామివారిని దర్శించుకునేదాకా చుక్క నీరు కూడా తాగను" "మనం వెంట్రుకవాసిలో తప్పించుకున్నాం" "అంతా పరమాచార్య స్వామివారి అనుగ్రహం వల్లనే" అన్నాడు పాల్ రాజ్. "అవునా?" తన వ్యంగ్య ధోరణి మారలేదు.

వారు కంచి చేరుకునేటప్పటికి మధ్యాహ్నం మూడు గంటలు అయ్యింది. చెరువుల్లో ఈత కొడుతున్న హంసలు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న తాటి చెట్లు, ఆలయ గోపురాలు కొత్తగా, శోభాయమానంగా వున్నాయి. స్వామివారి శతాబ్దపు ఉత్సవాల కోసం పట్టణం మొత్తం సింగారించుకుంటోంది. ఎక్కడ చూసినా చలువ పందిళ్లతో, వెదురు కర్రల బారులతో. గోవులు, ఎద్దులు మరియు కుక్కలు వీధులంతా తిరుగుతున్నాయి. భాగీరథి సంతోషానికి అవధులు లేవు. అక్కడ ఒక పెద్ద పందిరి ఏర్పాటు చేయబడింది.

"ఉత్సవాలు ఇక్కడే జరుగుతాయి మేడమ్." "ఈ ప్రాంతాన్ని చూసినవారెవరైనా ఇది పల్లవ రాజుల రాజధాని అంటే నమ్ముతారా? నువ్వు వాటికన్ చూశావు కదా, ఎలా ఉంది అది? వెయ్యి సంవత్సరాల పురాతన ప్రాంతాన్ని అమెరికా ఎలా కాపాడుకుంటుంది?" "నాకు అది అంతా ముఖ్యం కాదు సార్" "నేను నీతో మాట్లాడడం లేదు పాల్ రాజ్" "మనం నేరుగా స్వామివారి దర్శనానికి వెళ్ళి, తరువాత ఇతర దేవాలయాలను చూద్దాము" అన్నాడు పాల్ రాజ్.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము3 : అమృత స్వరూపాచ**

**అమృత స్వరూపాచ** - (భక్తి అన్నది) అమృత స్వరూపమైనది కూడా. నారదుల వారు ఈ సూత్రము ద్వారా భక్తి అన్నది అమృత స్వరూపమును కలిగి ఉంటుందని వివరిస్తున్నారు. (**సా పరమ) అమృత స్వరూపాచ** అన్న భావములో కూడా దీనిని తీసుకొనవచ్చు. భక్తి బాహ్యంగా ప్రేమ రూపమును కలిగి ఉన్నా అంతరముగా మాత్రము అమృత స్వరూపమునే పొంది ఉంటుందని దీని భావము.



అమృతము అంటే ఎన్నటికీ మార్పు లేక శాశ్వతమైనది అని అర్థము. "**పరా భక్తి ఈశ్వరే**" అని చెప్పబడినట్లు మార్పు లేకుండా ఉండే ఈశ్వరుని మీద ఉన్న భక్తి ఎప్పటికీ అమృతప్రాయమే అవుతుంది కదా. ఆ పరాభక్తిని కలిగి ఉండడమే అమృతము అని భావించాలి.

సాధారణంగా పరిపక్వత చెందిన సిద్ధ స్థితిలో భక్తి అమృతమును అందిస్తుందని అనుకోవడం సహజం. కానీ సాధనా స్థితిలోనే భక్తిని అమృతతుల్యంగా వివరించారు. ఇది కేవలం భక్తికి మాత్రమే సాధ్యము. అంటే "నా గురుదేవులే నాకు సర్వస్వము" అన్న భావనతో సాధనను కొనసాగిస్తున్న శిష్యుడికి గురుదేవుని అనుగ్రహం ద్వారా తన ప్రయాణం కూడా అమృతత్వ భావనను కలిగిస్తుంది.

అమృతము అంటే ఆనందమును ఇచ్చేది అని కూడా ఉన్నది. ఆనందానికి దుఃఖ అభావమునకూ (లేకపోవడానికి) తేడా ఉంటుంది. సాధారణంగా మనం సుఖముగా భావించేది దుఃఖ ఉపశమనమే తప్ప నిజమైన ఆనందం కాదు. కానీ భక్తిని అమృత స్వరూపము అన్నప్పుడు అసలు ఆనందము లేక సుఖము అన్న భావము కూడా తెలియని అనిర్వచనీయ స్థితిగా భావించాలి. అఖండమూ పరిపూర్ణమూ అయిన సచ్చిదానందము కేవలం భక్తి ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ఈ సూత్రం వివరిస్తోంది.

భక్తిలో ఆర్ద్రత ఉన్నప్పుడే అది పరమమైన ఆనందాన్ని ప్రసాదిస్తుంది. ఆ ఆర్ద్రత వున్నదా లేదా అన్నది ఎవరికి వారికే అనుభవైకవేద్యము. నిజమైన భక్తుడు తన గురుదేవుల యొక్క స్మరణ, కీర్తన ధ్యానాదులనే అసలైన అమృతముగా భావిస్తాడు. అటువంటి అమృతమును గ్రోలిన సాధకుడు చివరికి అమృతత్వమునే పొందుతాడు కదా!

మృత్యుభావన లేకుండా ఉండడమే అమృతత్వమనీ, అదే నిజమైన మోక్షము అనిపించుకుంటుందనీ శ్రీ బాబూజీ మహరాజ్ వారు శలవిచ్చారు. కఠోపనిషత్తులో **"అథ మర్త్యో అమృతో భవతి"** అంటూ మర్త్యుడైన మానవుడే అమృతత్వమును పొందగలడని తెలుపబడింది. పురుష సూక్తములో కూడా **"తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి"** అంటూ అమృతత్వము ఇక్కడ ఇహములో పొందేదే అని చెప్పబడింది. శ్రీ బాబుజీ మహరాజ్ వారు కూడా ఈ విషయమునే ప్రస్తావిస్తూ మోక్షము, లేక ముక్తి అన్నది శరీరంతో ఇక్కడే ఇహములో అనుభవించాలని, పోయిన తర్వాత వచ్చేది కేవలం ఎత్తిపోతలే అని శలవిచ్చారు కదా!

రెండవ సూత్రములో భక్తిని ప్రేమ **"రూపము"**గా వర్ణిస్తూ ఈ సూత్రములో అమృత **"స్వరూపము"**గా నిర్వచించడానికి కూడా కారణం కనిపిస్తుంది. ఈ భక్తి ద్వారా మాత్రమే మీ స్వస్వరూపమును తెలుసుకొన గలుగుతారని, మార్పులేని అమృతత్వమే మీ నిజ స్వరూపమని నారదుల వారు సాధకులకు ఈ సూత్రము ద్వారా సందేశం ఇస్తున్నారు.

- సశేషం

నిజంగా నీవు మనశ్శాంతిని
కోరుకుంటున్నట్లయితే,
ఎదుటివారి లోని తప్పులను
ఎంచటం మానివేయి.

- శ్రీ శారదాదేవి

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2024**

5 సోమ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

8 గురు: మాసశివరాత్రి

9 శుక్ర: అమావాస్య

14 బుధ: మాఘ శుద్ధ పంచమి - వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ

16 శుక్ర: రథసప్తమి

20 మంగళ: మాఘ శుద్ధ ఏకాదశి - భీష్మ ఏకాదశి. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

24 శని : మాఘ పూర్ణిమ - గురు పూర్ణిమ. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

**మార్చి 2024**

5 మంగళ: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

8 శుక్ర: మహాశివరాత్రి - తె.జా.3.30 గం. లకు శ్రీ గురుదేవులకు బృందావనములో నమక చమక సహిత రుద్రాభిషేకము. ఉ.5.30 గం. లకు శ్రీ సద్గురు పాదపూజ. ఉ.8.00 గం.లకు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయములో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు. మ.12.00 గం.లకు సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం.లకు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి వారి సామూహిక కళ్యాణ మహోత్సవం, అనంతరం నగరోత్సవం

10 ఆది: అమావాస్య

13 బుధ: ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన, సత్సంగం

25 సోమ: ఫాల్గుణ పూర్ణిమ - హోలీ పండుగ. శ్రీ సద్గురు పాదపూజ

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**41. ద్విదళ కమలమున జూపులు పదిలముగా నిలిపి కోటిభానునిభుం దో**
**యద దేహు బీత చేలు, న్సదమల భక్తిని భజింపు సతతము మనసా.**

తాత్పర్యము: కోటి సూర్య తేజములతో వెలుగొందు ద్విదళ కమలము నందు అంతర్ దృష్టి నిలిపి నీలమేఘశ్యాముడు, పీతాంబరధారి అయిన రాముని నిశ్చల భక్తితో భజింపుము మనసా.

**42. చంద్రార్క కోటితేజు, న్సాంద్రామల మందహాసు సర్వేశ్వరు దే**
**హేంద్రియములకు విలక్షణు, నింద్రాదినుతు న్భజింపు మింపుగ మనసా.**

తాత్పర్యము: కోటి సూర్య చంద్ర తేజములు గలిగి దేహేంద్రియములకు విలక్షణుడగు, చిక్కని నిర్మల మందహాస పూరితుడగు సర్వేశ్వరుడు, దేహేంద్రియములకు విలక్షణుడు, ఇంద్రుడు మొ. వారిచే నుతింపబడు నాతనిని భజింపు మనసా.

**43. కలితాక్షర శబ్దస్వరముల నంటక వ్యంజనముల బొరయక బిందూ**
**జ్జ్వల నాదకళల మీరిన, యలభద్రాచలనివాసు నరయుము మనసా.**

తాత్పర్యము: అక్షర శబ్ద స్వరములలో పడి ఉండక, వాదోప వాదాలను చేయక నాదబిందు కళాతీతుడైన భద్రాచలవాసుని కొలువుము మనసా.

**44. అక్షయమైన యకారా, ద్యక్షరముల మీటి యక్షరాక్షరములతో**
**నక్షరమై లక్షణమై సాక్షియు నగు రాముదలపు సతతము మనసా.**

తాత్పర్యము: క్షయము లేని వాటికంటే ఉన్నతమై యక్షరాక్షసులతో క్షయము లేనివాడును, సాక్షి అయినవాడును అగు రాముని సతతము తలపుము మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

భరతుడు అన్నగారిని అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యమేల వలసిందని అభ్యర్థించ, రాముడు తండ్రిగారి ఆజ్ఞను జవదాటుట తగదని, భరతుడే రాజ్యమేలవలయునని బదులిచ్చాడు. "మొదటివాడు ఉండగా చివరి కొడుకు రాజ్యమేలుట ఏ విధముగ తగునని ప్రశ్నించి, కావలసినట్లైతే, మీకు బదులుగ నేను వనవాసము చేసెదను. మా తల్లి మన తండ్రిగారికి, మనకు చేసిన ద్రోహమునకు ఇదే తగిన ప్రాయశ్చిత్త మగును" అన్నాడు భరతుడు.

"తండ్రిగారి మాటలు గొప్ప మంత్రములని మరచితివా సహోదరా! ఆయన ఆజ్ఞను తారుమారుచేయుట ఆయనను అవమానించినట్లేగదా" అన్నాడు రాముడు. కులగురువులైన వశిష్ఠుల ముంగిట ఆ సహోదరుల వాగ్వివాదము తీవ్రముగ జరిగింది. ఆయన గౌరవంతో పెద్దతనంతో భరతునివైపు చూసి, "కొనియాడబడదగు నీయొక్క నడతచే రఘువంశమునకు తిలకమువంటి వాడివని కొనియాడబడెదవు. రాముడు తన ధర్మమును ఒక్క క్షణమైననూ విడువడు. నీవే కాస్త తగ్గి, ఆయనను అనుసరించి పోవలయును" అన్నారు. ఈ నడుమ ఆకాశమందలి దేవతలు రాముని అవతార కార్యం భగ్నమైపోతుందేమోనని భయపడి, రామునితో, "ఓ రామా! నీవు నీ తండ్రికి ఇచ్చిన మాట జవదాటకూడదు కదా!" అన్నారు. "చూశావా భరతా! దేవతలుకూడా నేను చెప్పిన మాటకు అంగీకారం తెలిపారు. వారి మాటలను జవదాటుట మనకు తగదు. గాన, ఇది నా ఆజ్ఞ! నీవు పధ్నాల్గు సంవత్సరములు అయోధ్యను పరిపాలించే తీరాలి!" అన్నాడు రాముడు దృఢనిశ్చయంతో.

అన్నగారి ఆజ్ఞానుసారము భరతుడు, అయోధ్యకు తిరుగు పయనము జేయగోరి, పదునాల్గు సంవత్సరములు రాముని ప్రతినిధిగనె తాను రాజ్యమేలెదనని నిశ్చయించుకుని, రాముని పాదుకలను తీసుకుని, భవ్యముగ తన శిరస్సుపైనుంచుకుని బయలుదేరాడు. ఈ సంఘటనను పెరియాళ్వారుల పాసురముద్వారా (అనువాదము) ఆస్వాదించెదము:

- సశేషం

# అంతా రామ మయం

ఫస్ట్ జనవరి 2024

- రమణ ప్రసాద్

ఈ రోజు విశేషం మనకు తెలిసినదే! కాలం ఎవరికోసం ఆగదు. కాని భగవంతుని ఆశ్రయించిన వారికి ఎప్పుడూ ఏ లోటూ లేదు, ఉండదు. భగవన్నామాన్ని స్మరించేవారెన్నడూ చెడిపోరు. వారు తప్పక తరింపబడతారు.

రాముడు అంతటా ఉన్నాడు. మన లోపల చేరి మాట్లాడించేవాడు వాడే. దానిని గుర్తించే వివేకం ఉండాలి. ప్రపంచం పైకి వెళ్ళే దృష్టిని అంతర్ముఖం చేయాలి. మీరు విన్న బోధను చర్చించుకోండి. మీలోకి మీరు వెళ్ళిపోండి. దానినే ధ్యానం అన్నారు. నూతన సంవత్సర ప్రారంభంలో ఎవరికి వారు నిర్ణయించుకోవాలి. ఏమని? మనం సాధనలో ఎంత పరిణతిని పొందాం? మనం గమ్యం ఎప్పుడు చేరతాం? అని గట్టి పట్టుదలతో సాధన చేయాలి.

అవధూత అంటే వస్త్రాలు లేనివాడుకాదు. దేహదృష్టి లేనివాడు అని అర్థం. పుట్టుట - చచ్చుట అనే రోగం పోగొట్టుకోవాలి. భగవన్నామం చేస్తూ మన కర్మలను రహితం చేసికోవాలి. ధర్మపరమైన కర్మలు చేస్తూ, మహాత్ములు చెప్పినట్లుగా నడుచుకుంటే ఈ జనన మరణ వలయం నుండి బయటపడతాం. శ్రీ బాబూజీమహరాజ్ గురువు గారిని (హనుమాయమ్మగారిని) "మీకు మళ్ళీ జన్మ ఉన్నదా?" అని అడిగినదానికి సమాధానంగా, "నాకు జన్మ ఉంటే, మీరు మళ్ళీ అవతారానికి రావాలి, మమ్మల్ని తరింపజేయటానికి" అని ధీరత్వంగా అన్నారు.

మరణించిన పిదప మళ్ళీ మానవజన్మ వస్తుందని గ్యారంటీ లేదు. మనలో ఉన్న అరిషడ్వర్గాలనీ, ఈర్ష్య, అసూయ, మాత్సర్యము ఓర్వలేనితనము - వీటిని తొలగించుకోవాలి. బతికి ఉండగానే మరణించాలి. అంటే ఆయనే తీసుకువచ్చాడు, ఆయనే తీసుకుపోతాడు అనే స్థితి. అటువంటి స్థితిని పొందింప జేసేవారు శ్రీగురుదేవులు మాత్రమే. సుదాముడు మోక్షాన్ని కోరుకోలేదు. "నీ పాద కమల సేవయు, నీ పాదార్చకులతోటి నెయ్యమును, నితాంత అపార భూతదయయును ప్రసాదించ"మని భగవంతుడిని కోరాడు.

అంతటా భగవంతుడు ఉన్నాడని గురువుగారు బోధ చేసారు. ఒక శిష్యుడు ఆ బోధను విన్నాడు. ఎదురుగా ఒక మదపుటేనుగు వస్తుంటే "అంతా బ్రహ్మయే కదా" అని దానికి ఎదురుగా వెళ్ళాడు. ఏనుగు అతనిని తన తొండంతో విసిరి పారేసింది. గురువుగారు, "నిన్ను సావధాన పరచిన మావటివాడిలో ఉన్న బ్రహ్మను గుర్తించలేదా?" అని మందలిస్తారు.

ఈ నూతన సంవత్సరంలో "మీరు సూచించిన మార్గంలో పయనించి, మాలో సమభావనను, తృప్తిని ప్రసాదించు ప్రభూ!" అని శ్రీ గురుదేవులను ప్రార్థించాలి. తరింపజేసే సహజమైన మార్గాన్ని గురుదేవులు తెలిపి ఉన్నారు. వారు మనలని ఎన్నటికీ వదిలిపెట్టరు. దేహభావన పోవాలి. **"దేహ వాసన వదలిన ఘన దివ్యదృష్టియె రామనామము। శ్రీమహాతత్త్వబోధ విశేషమైనది రామనామము। సోమ సూర్యాదులను మించిన రమ్యమైనది రామనామము॥"** శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారు ఆలపించిన కీర్తనను తన్మయతతో విని శ్రీ స్వామివారు దాని పైన బోధ చేసేవారు. దేశ వ్యాప్తంగా రాముడు సంచరించిన ప్రమాణాలు తెలుస్తున్నాయి. అటువంటి పుణ్యభూమిలో పుట్టిన మనం ఎంతో అదృష్టవంతులము. ఈ నెలలోనే అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ జరగబోతోంది.

ఇంతకీ ఆ రామడెవరయ్యా! మనకు ఆశ్రయమిచ్చిన శ్రీ గురుదేవులే. వారి అనుగ్రహంతోనే మన జీవితాలు నడుస్తున్నాయి. ఆయన ఎక్కడో లేడు. మనలో విరాజమానమై మన ఇంద్రియాలకు శక్తినిస్తూ మనం తీసుకునే ఆహారాన్ని వైశ్వానరుడిగా జీర్ణింప చేస్తున్నాడు. మనకు కలిగే ఆపదలను తమపైకి తీసుకుని మనలను అనుక్షణం కాపాడుతున్నాడు. మన తల్లిదండ్రులు చేసిన పుణ్యం వల్ల మనకి శ్రీవారి సన్నిధి లభించింది.

రామతత్వాన్ని శ్రీగురుదేవుల ముఖస్థగా వింటేనే తృప్తి కలుగుతోంది. కూర్చుంటే రామా! నుంచుంటే రామా! ఏది చేస్తున్నా రామా! - అలా మన హృదయంలో అయోధ్యను, అందులో ప్రకాశించే రాముడిని ప్రతిష్ఠించుకుని ఆరాధించాలి. మనం ఇక్కడ ఇదిగో ఈ మూర్తి, ఈ పాదుకలు చూస్తున్నాం. వారు ఎవరై ఉన్నారు, ఏమై ఉన్నారు? అంటే ఏది కాకుండా ఉన్నారు? అటువంటి మన ప్రభువు

తత్వాన్ని గుర్తించాలంటే వారు చేసిన బోధను చెవులారా వినాలి. తరువాత విచారణ చేయాలి. శ్రీగురుదేవులు మనకు ప్రసాదించిన కీర్తనలో, "**భార్యా పుత్రుల బంధు మిత్రుల మమకారములు మాయలేరా। మరువకురా మాధవుని పదములు, మదిలో సదా నిలుపరా। అది నాది ఇది నాదని విర్రవీగెదవూ, ఏదీ నీది కాదురా, నేను నాది దూరమైనపుడు నీవు నీవుగా నిలిచెదవురా। ఇదే నిజము రా ఇదే సత్యము రా!**" అని బోధించారు.

నిజంగా ఉపాసన చేస్తే భగవంతుడు మనతోనే ఉన్నాడు. ఉన్నచోటే ఉండి వీటన్నిటినీ ఆడిస్తున్నాడు.

**అంతా రామమయం, ఈ జగమంతా రామమయం ॥**

**అంతరంగమున ఆత్మారాముడు( శ్రీ గురుదేవుడు) అనంతరూపమున వింతలు సలుపగ। సోమ సూర్యులును సురలు తారలును ఆ మహాంబుధులు అవనీజంబులు॥(1)**

**అండాండంబులు, పిండాండంబులు, బ్రహ్మాండంబులు బ్రహ్మలు మొదలుగ। సోమ సూర్యులును। నదులు వనంబులు నానా మృగములు, విహిత కర్మములు వేద శాస్త్రములు॥(2)**

**అష్ట దిక్కులును, ఆది శేషుడును, అష్ట వసువులును అరిషడ్వర్గము। ధీరుడు భద్రాచల రామదాసుని కోరికలొసగెడు తారక నామము॥(3)**

"ఆ రాముడు అనంతంగా సూర్య చంద్రులలో దేవతలలో, అంబుధులలో, అవనీజములలో; బ్రహ్మాండములలో, పిండాండములలో, వనాలలో, మృగాలలో, తారలలో, విహిత కర్మలలో, వేదాలలో, నదులలో; అన్నిదిక్కులలో, అష్ట వసువులలో, అరిషడ్వర్గములో ప్రకాశిస్తున్నాడు" కోరికలన్నిటినీ తీర్చేటి అట్టి రామతారక నామమును సతతము భజించండి" అని భక్త రామదాసు మనలని హెచ్చరిక చేస్తున్నాడు.

"అంతా రాముడే అయితే నువ్వేమవుతావు? నువ్వూ రాముడవే అవుతావు" అనేవారు శ్రీ గురుదేవులు. ఎందువల్ల తెలుసు కోలేకపోతున్నా మంటే అజ్ఞానమనే పొర కమ్మి ఉండటం చేత. అజ్ఞానం పోవాలంటే మనం అన్నిటిలో అందరిలో రాముడిని దర్శించగలగాలి. శ్రీ గురుదేవులు ప్రసాదించిన లక్ష్యార్థాన్ని నిరంతరం రాపిడి పెట్టాలి. ఇంకో దిక్కు లేదు. ఉన్నదంతా భగవత్స్వరూపమే అన్న నిజాన్ని గుర్తించినప్పుడు "నీవు నీవుగా నిలిచెదవు రా!" అని శ్రీ గురుదేవుల మాట అటువంటి తత్వసంపదను మనం నిలబెట్టుకోవాలి. అట్టి భక్తిని, శక్తిని, శ్రీ గురుదేవులు అందరికీ ప్రసాదించెదరు గాక, సుఖీభవ!!

## పూజ్య శ్రీ వాసుదేవానంద గిరి స్వామివారి అభిభాషణ

- రమణ ప్రసాద్

**"యా దేవీ సర్వ భూతేషు జ్ఞాన రూపేణ సంస్థితా।**

**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః॥**

ఈ క్షేత్రానికి అధిష్ఠానమైన పూజ్య శ్రీ బాబూజీ మహరాజ్ వారికి, ఆ స్థానంలో విరాజిల్లుతున్న పూజ్య శ్రీ మాతాజీ వారికి, ఇంతమందిలో ప్రకాశించే సద్గురు స్వరూపానికి ప్రణామాలు అర్పిస్తూ, ఈ రోజు స్వామివారి పుణ్యారాధన. ఆ పేరులోనే ఎంతో అర్థం దాగి ఉంది. పుణ్యం ఎందుకు? పాపాన్ని పోగొట్టటానికి. పుణ్యం వస్తే భోగం, భోగం వస్తే రోగం. మళ్ళీ పాపం వస్తుంది. గురుపాదం తాకాలి అంటే మనకు ఒక అర్హత ఉండాలి **"పుణ్య లభ్యా"** మనకు పుణ్యం ఉండాలి. ఆ పుణ్యం గురువు పాదాలవద్ద తలను వంచేట్టు చేస్తుంది.



మనం అన్నిట్లో త్వరగా జడ్జిమెంటు ఇచ్చేస్తాం. సృష్టిలో దేనికీ జడ్జిమెంటు ఇచ్చే అధికారం ఎవ్వరికీ లేదు. **"మయాధ్యక్షేన ప్రకృతిః సూయతే స చరాచరం।"** అమ్మ ఆహ్వానించారు. ఇది బాబూజీ సామ్రాజ్యం. జడ్జిమెంట్ ఇచ్చే అధికారం లేదు. **"తన్ మన్ ధన్ తుమ్హారా"**. "మీరు కడదేరుస్తారని మీ పాదాలని ఆశ్రయించాను. మీరు ఎలా నడిపిస్తే అలా నడుస్తాను. యుద్ధం చేసేవాడు అర్జునుడు. రథం నడిపేవాడు కృష్ణుడు. "మీరు నన్ను నడిపించండి" అన్నాడు. ఏమి చేయాలో విశదీకరించాడు భగవానుడు. ఎట్లా బ్రతకాలో చెప్పేవాడు గురువు. మోక్ష సామ్రాజ్యానికి ఎలా వెళ్ళాలో, జీవబ్రహ్మైక్యం చెందటానికి ఏదైతే అవసరమో, ఎలా జీవిస్తే ఆ స్థితికి వెళ్తామో బోధించేవాడు గురువు.

**"గుకారశ్చాంధకారస్తు రుకారస్తన్నిరోధకృత్। అంధకార వినాశిత్వా ద్గురురిత్య భిధీయతే॥** ఎంత గొప్ప మాటండీ! గురువు అంటే జ్యోతి. గాడ్ ఈజ్ లైట్. వెలుగులో అన్నీ చూడగలుగుతాం. సడెన్‌గా లైట్ పోయింది. గుర్తించే తెలివి ఉంది, అయినా తడబడతాం. సూర్యుడు వస్తే వెదుక్కోం. **"నఖదీధితి సంఛన్న నమజ్జన తమోగుణా"** "నీ తమస్సు చేత కలిగిన అనేక జన్మల యొక్క పాపములను, నీలోని అజ్ఞానమనే చీకటిని వదిలి పెట్టు" అని గురువులు

చెబుతారు. "న" అనే అక్షరం అజ్ఞానం. నా ఇల్లు, నా భార్య అని వీళ్లని నమ్ముతున్నాం. "నమ్మొద్దు, ప్రేమించు" అంటారు గురువులు. ఈ జగత్తుని నమ్మి సఫర్ అవుతున్నాం. నేను ఇంత చేశాను, నా కొడుకు నా మాట వినాలి అని జడ్జిమెంట్ చేసేస్తున్నాం. నీ కొడుకు నీ మాట ఎందుకు వినాలి? **"నఖదీధితి సంఛన్న నమజ్జన తమోగుణా"** - గురుపాదాల గోళ్ళు ఎట్లా ఉన్నాయి? సూర్యుణ్ణి అతిక్రమించే పాదాలు గురుపాదాలు. ఆ పాదాలపైన తల పెట్టేసరికి అజ్ఞానమనే పొర తొలగిపోతుంది. నీలో ఆలోచనలు తొలగి మనస్సు నిర్మలమవుతుంది. కరుణరసం పొంగుతుంది. గురు పాదాలు నిన్ను సంసారంలో చిక్కకుండా చేస్తాయి. **"బాలా లీలా వినోదిని"** మా గురుదేవులు ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ప్రసన్నంగా చూసేవారు. మనలోని అహంకార పొరను చీల్చే చూపు వారిది. "తనదు బాగు కోరి తత్వంబు బోధించు గురువు".

**"న గురోరధికం నగురోరధికం, నగురోరధికం విధిశాశనతః"** - బ్రహ్మ దేవుడే చెప్పాడు. దేవతలు ఫలాలు ఇస్తారు, ఐశ్వర్యం ఇస్తారు. కాని మోక్షం ఇవ్వలేరు. మోక్షం గురువు అధీనం. బ్రహ్మానందం - ఎప్పుడూ ఒకే ఆనందం. అది **అచలోయం, సనాతనం,** మూడు అవస్థలలోనూ ఏక రీతిలో ఉంటుంది. గాఢనిద్రలో కలలు రాని స్థితి. అక్కడ ఆధారం లేని సుఖాన్ని, ఆనందాన్ని పొందుతారు.

**నిశ్శబ్దం బ్రహ్మ ఉచ్యతే** - నిశ్శబ్దమే బ్రహ్మ. ఒక భార్యాభర్తలు వుండేవారు. గురువుని ఆశ్రయించారు. కాని మనసులో "న" అన్నది ఉంది కదండీ! వేసవికాలంలో పిల్లల్ని రప్పించుకోవాలి. పిల్లలు రాగానే ఆనందం పొందుతాం. వాళ్ళు వచ్చి చేసే అల్లరిని తట్టుకోలేము. మనం రోజూ చేసే అనుష్టానానికి అంతరాయం కలుగతుంది. జపతపాలు సమయంలో చేయలేకపోతాము. లేనిపోని కర్మ తెచ్చిపెట్టుకున్నామని విచారిస్తాము. తరంగ రహిత స్థితికి వెళ్ళలేకపోతున్నాము. ఒడ్డునకే వచ్చేస్తున్నాము. ఒడ్డున తరంగాలు ఉంటాయి. ఆ తరంగాల దెబ్బలకు తట్టుకోలేక చచ్చాం బాబోయ్! అంటాం. ఆ తరంగాలే కలలు. గురువు నిన్ను నిశ్శబ్ద తరంగరహిత స్థితికి తీసుకుని వెళ్తాడు. అక్కడ కలలు వుండవు. పూజ్య శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారు అనేవారు. ABC Life అంటే Always Be Carefull in Life . కీడెంచి మేలెంచు. **"బాలా లీలా వినోదిని"** - గురువు దగ్గర నీవు బాలుడివే. తండ్రి పిల్లవాడికి సైకిల్

తొక్కటం నేర్పుతాడు. బాగా తొక్కటం వచ్చాక సైకిల్ని పట్టుకోవటం వదిలేస్తాడు. భవసాగరంలో పడిపోకుండా పట్టుకుని ఈత నేర్పేవాడే గురువు. గురు సంసారం సెలయేరు. సెలయేటిలో నీరు తియ్యగా వుంటాయి. నీకు సేద తీరుస్తాయి. సముద్రంలో నీళ్ళు ఉప్పగా ఉంటాయి. అవి నీ దాహం తీర్చలేవు. సంసారం సాగరం వంటిది. అది నీకు శాంతి ఇస్తుందా? ఒక స్త్రీ ఖరీదైన పట్టుచీర కట్టుకుని పేరంటానికి వెళ్తుంది. చీర ఎక్కడ నలిగిపోతుందో అని జాగ్రత్త పడుతుంది. కుచ్చెళ్ళు మాటి మాటికి సద్దుకుంటుంది. ఇంటికి వచ్చి మామూలు చీర కట్టుకుని, "హమ్మయ్య" అంటుంది. పట్టు చీర విశేషం, మామూలు చీర సామాన్యం. అలాగే ప్రకృతి విశేషం, భగవంతుడు సామాన్యం. అది తరగదు, పెరగదు. నా గురువు సర్వత్ర నిండి ఉన్నాడు. చీమలో, దోమలో, శివకేశవాదులలో అంతటా నిండి ఉన్నప్పుడు నేను ఎవరిని ఆదరిస్తాను, ఎవరిని తృణీకరిస్తాను? అందుచేత నిజమైన జ్ఞాని నిర్లిప్తంగా, సాక్షిగా ఉంటాడు. బాలుడిగా, పిశాచం పట్టిన ఉన్మత్తుడిగా ఉంటాడు. పిల్లవాడు బుట్టలో దాక్కొని, "నన్ను వెదుకమ్మా!" అంటాడండీ! ఎక్కడ దాగాడో తల్లికి తెలియదండీ!

గురువు సర్వ వ్యాపి. **బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం** - ఎంత అద్భుతమండీ.! మన చెంతన మానుషరూపంలో ఉన్నప్పుడు గుర్తించలేమండీ. జడ్జిమెంట్ చేస్తాం. అది ఎంత తప్పండీ! సత్యం గ్రహించి ఎంత పోగొట్టుకున్నామని చింతిస్తాము. కాలం అందరినీ తీసుకు పోతుంది. గురువు దగ్గరకు వస్తాడండీ. "మాకు పిల్లలు పుట్టలేదనో, మా అబ్బాయికి డిగ్రీలో మంచి మార్కులు రావాలనో, మా అమ్మాయికి వివాహం కావటం లేదనో" అని మొరపెట్టుకుంటాడు. అది ఎలా అంటే రాజుగారి దగ్గరకు వెళ్ళి వంకాయిలు అడుక్కున్నట్లు. గురువు మోక్ష సామ్రాజ్యాన్ని ప్రసాదించేవాడు. దేవుడిని మనం కోరితేనే ప్రసాదిస్తాడు. గురువు నువ్వు అడగకుండానే నీకు ఇహపరాలలో అన్నీ ప్రసాదించి నిన్ను తన దరికి చేర్చుకుంటాడు. అంత మహిమ గురుపాదాలలో వుంది. 33 కోట్ల దేవతలలో కూడా లేదు. వారు కూడా వారు చేసిన పుణ్య ఫలాలు తరిగిపోతే మానవ జన్మకి రావాల్సిందే.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కె.పి. రాజుగారు శ్రీబాబుతో

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

మహాత్ముల సాంగత్యం లభించవలెనంటే ఎంతో పూర్వజన్మల సుకృతం ఉండాలి. వారి దర్శనభాగ్యం లభించినా, వారి సన్నిధిలోను, సాంగత్యంలోను మనం ఎంత సేపు ఉండగిలిగామా అనే దానికంటె, ఉన్న అమూల్య సమయము ఎంత తక్కువైనా, దానిని ఎంత వరకు సద్వినియోగం చేసుకోగలిగామా అన్నదే మనకు ఉపకరించే ముఖ్య విషయము.



గంటల తరబడి, రోజుల తరబడి వారితోనే సంచరిస్తున్నా, వారి వద్ద పుష్కలంగా ఉన్న అమూల్యమైన ఆత్మజ్ఞానమనే పెన్నిధిని మనం ఎంత వరకు స్వంతం చేసుకోగలిగితే అంతే మనకు దక్కుతుంది. వారి సన్నిధిలో కొన్ని నిమిషాలే ఉన్నా, అది సద్వినియోగం కావాలంటే, స్వాతివాన కోసం ఎదురు చూస్తూ తెరచుకుని ఉన్న ముత్యపు చిప్పవలె, మన హృదయమనే పాత్రను శ్రీగురుబోధ అనే అమృత వర్షబిందువు కోసం ఎప్పుడూ తెరచుకొని సిద్ధంగా ఉండాలి.

అలా ఉంటే ఆ గురు సన్నిధిలో, ఒక దివ్య క్షణంలో ఆ అమృత బిందువు పడనే పడుతుంది. మన హృదయ పాత్రలో అది ఆత్మ జ్ఞానమనే ముత్యపు రూపం ధరించి, గురు ముకుందుని వక్షసీమను అలంకరించిన ముకుందమాలలో ఒక మేలి ముత్యంగా ప్రకాశిస్తూ చరితార్థతను పొందుతుంది.

శ్రీ కొండ ప్రభాకరరాజుగారు (కె.పి. రాజుగారు) ఏలూరు నివాసులైన సుసంపన్న క్షత్రియులు. ఫిలిప్స్ కంపెనీ వారి వస్తువులతోను, ట్రాక్టర్లతోను వ్యాపారం చేసేవారు. వారి ధర్మపత్ని శేషులమ్మగారు గుండుగొలను గ్రామస్థులు. శ్రీ బాబు గుండుగొలను వస్తున్నప్పటి నుండి కె. పి. రాజుగారు వారిని గురించి విని ఉండటమే తప్ప 1949 వరకు వారితో పరిచయ భాగ్యం కలుగలేదు.

1949లో ఒకరోజు కె.పి. రాజుగారు షాపు నుండి రాత్రి ఒంటి గంటకు తిరిగి వచ్చారు. ప్రతిరోజు రాత్రి 8గంటలకే వచ్చేవారు యింత ఆలస్యంగా ఎందుకు వచ్చారో అనుకుంటూ తలుపు తీసిన శేషులమ్మగారు ప్రశ్నించక మునుపే, రాజుగారు సంతోషంతో తబ్బిబ్బవుతూ “శేషూ! ఇవాళ మన జీవితంలోనే చాలా గొప్ప రోజు. శ్రీ బాబు మన షాపుకు వచ్చారు” అన్నారు.

శేషులమ్మగారు ఆశ్చర్యపడుతూ “శ్రీ బాబు షాపుకు వచ్చారా? మరి మన యింటికి తీసుకొని రాకపోయారా?” అని అడిగారు. “అంతటి మహాత్ములను అల్పులమైన మన యింటికి పిలిచే అర్హత కూడ ఉండాలి కదా? వారిని మనం ఏ విధంగా గౌరవించగలము? అందుకని భయంతో యింటికి రమ్మనలేదు గాని, వారికి ఉపాహారము, పాలుగాని, కొబ్బరినీళ్ళుగాని తెప్పిస్తానని మనవి చేస్తే, వారు ఒక్క సోడా మాత్రం తీసుకున్నారు. ఎంత తేజస్సు! ఎంత నిరాడంబరత! ఎంత ఆత్మీయత!

శేషూ! ఇంతవరకు యింట్లో తల్లిదండ్రులుగాని, బంధువులు గాని, బయట స్నేహితులుగాని, అంతటి ప్రేమను, నా అభివృద్ధిని గురించిన అంతటి ఆసక్తిని, మన కుటుంబ యోగక్షేమాల పట్ల, సమస్యల పట్ల అంతటి ఆత్మీయతను వ్యక్తపరచిన వాళ్ళు లేరంటే నమ్మవేమో!

ఇంతకు మునుపు మనకెప్పుడూ వారితో అంత సన్నిహితంగా మాట్లాడే భాగ్యం కలుగలేదు. కాని శ్రీ బాబు నాకీనాడు ఆ మహాభాగ్యాన్ని ప్రసాదించారు. వారితో నేను మాట్లాడిన ఆ కొద్దిసేపటిలోనే, నాకు వారే భగవంతుడనిపించింది. మనము యిక నుండి వారినే మన గురువుగాను, దైవముగాను నమ్ముకొని, వారు చెప్పినట్లు ఆచరించుకో గలిగితే చాలు” అన్నారు. ఆ విధంగా కె.పి. రాజుగారికి శ్రీ బాబుతో ప్రధమ పరిచయం జరిగింది.

- సశేషం

## విష్ణు  కధలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

సమర్థులు "ఓహెూ జయరామ స్వామి సత్సంగ మహిమ చెపుతూ తను ఒక గొప్ప సాధువునని భావింప చేశాడన్న మాట! అతను జలాల్ ఖాన్‌కి రామ దర్శనం చేయించాల్సిందే లేదా జలాల్ ఖాన్ విధించే శిక్షను అనుభవించాల్సిందే. అనుభవం లేకుండా పెద్ద పెద్ద మాటలు మాట్లాడకూడదు. అతను చెప్పింది నేను ఋజువు చేసుకోవాలా? నేను రానని చెప్పు" అని వెళ్ళిపోయారు.

గోపాల్ కాళ్ళక్రింద భూమి కదిలింది. గురుదేవుడు ఇంత కఠినాత్ముడా? జయరామా! నీకు మృత్యువు తథ్యం" అనుకుంటూ నిస్పృహగా కోటవైపు నడిచాడు.

సమర్థులు నది ఒడ్డునుండి అదృశ్యమై జలాల్‌ఖాన్ కోటలో ప్రత్యక్షమై సవినయంగా ఖాన్ గారికి వమస్కరించారు. "ఖాన్ సాహెబ్ ! రామదర్శనం అతి సులభం. పువ్వులను నలపటంకంటే సులభమైనది. ఇంక ఆలశ్యం దేనికి? నేను నడిచే మార్గాన రండి అంతే" అన్నారు సమర్థులు. "ఓస్ ఇంతేనా!" అంటూ సమర్థుల వెంట నడిచాడు ఖాన్. సమర్థులు కోట గోడవైపు నడుస్తున్నారు. కోట దిగే దారి పట్టక కోటగోడవైపే నడుస్తున్నారు. గోడలకు వాననీరు పోవటానికి చిన్న చిన్న రంధ్రాలు ఉన్నాయి. ఖాన్ చూస్తుండగానే సమర్థులు సూక్ష్మంగా మారి ఆ రంధ్రం నుంచి బయటపడ్డారు. కోటగోడకు అటువైపు ఉన్నారు. "ఖాన్ సాహెబ్! ఈ దారిగుండా రండి. రాముడిక్కడ ఉన్నాడు. మీకు చూపిస్తాను" అన్నారు సమర్థులు. "నేను మామూలు దారిలో వస్తాను" అన్నాడు ఖాన్. "అబ్బే అది సునాయాసమైన దారి. అటువస్తే రాముడు కానరాడు. ఈ చిన్న కన్నం నుండే దూరి రావాలి" అన్నారు.

ఖాన్‌సాహెబ్ మామూలు దారిలో వచ్చి సమర్థులను చేరుకున్నాడు. "ఖాన్

సాహెబ్! అంత సులభంగా రామ దర్శనం అవుతుందని ఎలా అనుకున్నారు?" అన్నారు సమర్థులు. ఖాన్ పశ్చాత్తాప పడి, "నాకు హిందూ మత దీక్ష ఇవ్వండి. నన్ను మీ దాసుడిగా స్వీకరించండి" అన్నాడు. "చూడండి ఖాన్ సాహెబ్! భగవంతుని సేవించుకోవటానికి మతం మార్చుకోనక్కర లేదు. మీకు అభ్యంతరం లేకపోతే 'రామ' అనుకోండి. లేక 'అల్లా' అనుకోండి, గురుకృపను సాధించండి" అన్నారు.

ఒకసారి సమర్థులు శివాజీని 'సామనగఢ్' కోట నిర్మించవలసినదిగా ఆదేశించారు. ఆ గఢ్ నిర్మాణం అయ్యేదాకా అక్కడే ఉండి స్వయంగా అన్ని పనులు చూసుకోమని ఆదేశించారు. శివాజీని "రోజూ నీకు ఇచ్చిన లక్ష్యార్థాన్ని ధ్యానించుకో. ఎప్పుడూ జాగరూకుడవై ఉండు" అని కోట శంఖుస్థాపన చేసి వెళ్ళిపోయారు. శివాజీకి సమర్థులను చూడాలని అనిపించింది. "సరే ఈశ్వరేచ్ఛ" అనుకుని కోట నిర్మాణ కార్యక్రమంలో మునిగిపోయాడు. ఇంతలో సమర్థులు కోటకు అటు వైపు నుండి పైకి వచ్చారు. "స్వామీ! కోటకు అటు దారి లేదు. మీరు ఎలా వచ్చారు?" అన్నాడు శివాజీ. "శివాజీ! శత్రువు ఎటైనా రావచ్చు కావున సదా జాగరూకుడవై ఉండు. కోట నిర్మాణం ఎలా ఉందో చూద్దాం పద" అని కోట నిర్మాణం చూడసాగారు. ఆయన ఒక చోట ఆగి "ఇక్కడ అడ్డదారి నిర్మించమన్నాను కదా!" అన్నారు. "ప్రభూ! దారిలో పెద్ద బండ అడ్డంగా ఉంది. దానిని పగులగొట్టాలి. ఆ తర్వాత ఆ దారి తయారవుతుంది" అన్నాడు శివాజీ. "అయితే ఆ బండ తీయించు" అన్నారు సమర్థులు. ఆ బండ పగుల గొడుతూంటే ఆ బండ మధ్యలో పిడికిడంత డొల్ల, ఆడొల్లలో నీరు. ఆందులోంచి ఒక కప్ప ఛెంగున శివాజీ పైకి దూకింది.

"'శివాజీ! ఇంత మందిని నీవు పోషిస్తున్నావు. నన్ను ఎలా మరిచావు?' అని ఆ కప్ప నిన్ను అడుగుతోంది. దానికేం తెలుసు? బండలో కూడా నువ్వు ఆహారాన్ని అందిస్తున్నావని. నిజంగా ముల్లోకాలను నీవే అన్నదాతవై పోషిస్తున్నావు" అన్నారు.

- సశేషం

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము, పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)

**భవన నిర్మాణము**

సమర్థ సద్గురుదేవులు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు లోక కళ్యాణం కొరకై ఎన్నో చోట్లకు వెళ్ళి ఎందరో భక్తుల ఆర్తిని బాపిన అవతార పురుషులు. వారు నడయాడిన ఊరు భీమవరము మరియు ఆ చుట్టు ప్రక్కలనున్న యనమదుర్రు, దిరుసుమర్రు మొదలగు గ్రామములు. శ్రీ స్వామివారు మహా ప్రస్థానం పొంది 35 సంవత్సరములు అయినవి. ఇచ్చటి భక్తులందరూ చేరి భీమవరం-ఉండి రోడ్డున దాతలు ఇచ్చిన స్థలములో బృందావనము, దాని ప్రక్కన అన్నదాన శాల, వసతి గృహము నిర్మింప సంకల్పించినారు. ఈ భవన శంకుస్థాపన శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతి యోగిని శ్రీచంద్ర కాళీ ప్రసాద మాతాజీవారు, ది.10-05-2023 తెల్లవారు జామున 3.24 గం.లకు చేశారు.

ఈ సందర్భమున భక్తులకు చేయు విన్నపమేమనగా, మీరెల్లరూ ఉదార స్వభావముతో ముందుకు వచ్చి త్వరలో ఈ భవన నిర్మాణము పూర్తియగునట్లు తమ సహాయ సహకారములను ధన రూపేణ, వస్తు రూపేణ అందించమని ప్రార్థించుచున్నాము.

విరాళములు ఈ క్రింది బ్యాంక్‌కు పంపవలెను.

Sri Sri Sri Hanumat Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Nambur Branch
S/B Account No : 69900 1000 00 172
IFSC : BARB0DBUNAM (5th character is 'zero')
Contact Numbers
Murali : 93983 34345
Tummalapalli Siva : 96181 99556

**భక్తులు ఒసగు విరాళములకు ఐ.టి యాక్ట్ 80జి క్రింద పన్ను రాయితీ లభించును.**

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

కార్తీక పౌర్ణమినాడు శ్రీ కాళికాపరమేశ్వరీ,
శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల ఊరేగింపు



కార్తీక పౌర్ణమినాడు శ్రీ సద్గురు పాదపూజ



REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2024-2026

ది. 21-12-2023 గుంటూరులో శ్రీ సనాతన హిందూ ధర్మ సాధన పరిషత్ ట్రస్టు వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి శ్రీమద్భగవద్గీత వక్తృత్వ పోటీలలో 4 - ప్రథమ, 2 - ద్వితీయ, 1 - తృతీయ స్థానములలో మన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు.





If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.